క్లుప్తంగా

అనధికారికంగా టాలెంట్ టెస్ట్

మణుగూరు టౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో అనుమతి లేకుండా విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించగా ఎంఈఓకు ఫిర్యాదు అందడంతో యాజమాన్యం విద్యార్థులను ఇంటికి పంపించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది.

మణుగూరుకు చెందిన ఓ ప్రైవేట్ పాఠశాలలో రూ.150 ఫీజు వసూలు చేసి మండలం, పట్టణంలో 1 నుంచి 6వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు అనధికారికంగా టాలెంట్ పరీక్ష నిర్వహించారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం ప్రతిభను పెంపొందించేలా చర్యలు తీసుకోవాలే తప్ప ఎలాంటి టెస్ట్‌లు నిర్వహించవద్దని, సెలవు రోజుల్లో విద్యార్థులను పాఠశాలకు పిలవవద్దనే నిబంధనలు ఉన్నా ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం టాలెంట్ టెస్ట్ నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై ఎంఈఓ వీరస్వామిని వివరణ కోరగా, టాలెంట్ టెస్ట్ నిర్వహించే హక్కు, అర్హత ఏ ప్రైవేట్ పాఠశాలకు లేదని, సదరు పాఠశాల యాజమాన్యానికి ఫోన్ చేయగా ఎలాంటి పరీక్ష నిర్వహించలేదని చెప్పారని తెలిపారు. అయితే ఈ విషయాన్ని డీఈఓకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ప్రజాస్వామిక శక్తులు ఏకం కావాలి

అశ్వాపురం: దేశ సమగ్రత, సమైక్యతకు విఘాతం కలిగించే బీజేపీని, బీజేపీతో చీకటి ఒప్పందాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ పార్టీలకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక లౌకిక శక్తులు ఏకం కావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కమటం వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం జరిగిన సీపీఐ మండల స్థాయి కార్యవర్గం, కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గత ఎన్నికల హామీలు విస్మరించి ప్రజావ్యతిరేక, కుటుంబపాలన సాగిస్తున్న బీఆర్ఎస్‌ను, గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలు పెంచి సామాన్యులపై భారం మోపుతున్న కేంద్రంలోని బీజేపీకి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్రంలో గెలుపు, ఓటములు శాసించే శక్తి కమ్యూనిస్టులకు ఉందని అన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, నాయకులు మద్ది వెంకటరెడ్డి, సురేందర్‌రెడ్డి, రాయపూడి రాజేష్, వెంకటేశ్వర్లు, ఈనపల్లి పవన్‌సాయి, దండి నాగేష్, నవీన్, నాగేంద్రబాబు, శ్రీకాంత్, వెంకన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లాభాల వాటా చెల్లించాలి

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ కార్మికులకు ఎలక్షన్ కోడ్ పేరుతో నిలిపివేసిన లాభాల వాటా వెంటనే చెల్లించాలని కోరుతూ మణుగూరులోని అన్ని మైన్లు, డిపార్ట్‌మెంట్ల వద్ద ఉన్నతాధికారులకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. సింగరేణి కార్మికులకు చెల్లించే లాభాల వాటా యాజమాన్యం చెల్లిస్తోందని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేది ఏమీ లేదన్నారు. నాయకులు మేకల ఈశ్వర్, పుల్లారావు, ఆవుల నాగరాజు, నంబూరు శ్రీనివాసరావు, కోడి రెక్కల శ్రీనివాసరావు, బండారు రవి, సాయి ప్రకాశ్ చారి, మన్నెం యోహాన్, దాట్ల సందీప్, జానకి ప్రసాద్, సుధాకర్, బీవీ సత్యనారాయణ, బొక్క శ్రీను ఉన్నారు.

భద్రాద్రి క్రీడాకారుల ప్రతిభ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సీటీ స్టైల్ జిమ్ క్రీడాకారులు బెంచ్ ప్రెస్ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ చాటారు. ఈ నెల 15న మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో జరిగిన ఆరు జిల్లాల స్థాయి బెంచ్ ప్రెస్ పోటీలలో సీటీ స్టైల్ జిమ్ క్రీడాకారులు మూడు బంగారు, రెండు సిల్వర్, ఒక కాంస్య పతకాలను సాధించారు. 69 కేజీల ఉమెన్స్ విభాగంలో మామిడి భూమికకు బంగారు పతకం, 59 కేజీల విభాగంలో భరత్‌కుమార్‌కు బంగారు పతకం, 105 కేజీల విభాగంలో మోతుకూరి పవన్‌కు బంగారు పతకం వరించింది. క్రీడాకారులు, జిమ్ కోచ్ రామిరెడ్డిని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు భోగాల శ్రీనివాసరెడ్డి అభినందనలు తెలిపారు.

ఆర్థిక సాయం

మణుగూరురూరల్: మండలంలోని కూనవరం గ్రామపంచాయతీలో నిరుపేద కుటుంబానికి చెందిన పాయం సూరమ్మ పక్షవాతంతో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండగా.. పంచాయతీ సర్పంచ్ ఏనిక ప్రసాద్, బీఆర్ఎస్ పినపాక నియోజకవర్గ నాయకులు బుద్ధరాజు నవీన్‌బాబులు సోమవారం రూ.5వేలను ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలతోపాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన భిక్షమయ్య

అశ్వాపురం: భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్యను అక్కడి క్యాంపు కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో భద్రాచలం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఖరారు కావడంపై ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. భద్రాద్రి రామయ్య ఆశీసులతో రెండో సారి గెలుస్తారని భిక్షమయ్య ఆశాభావం వ్యక్తం చేశారు.

గంజాయి మత్తులో చిత్తు

- మణుగూరులో విచ్చలవిడిగా అమ్మకాలు
- క్రమంగా అలవాటు పడుతున్న యువత
- రోజురోజుకూ పెరుగుతున్న వాడకం



మణుగూరురూరల్: మణుగూరులో గంజాయి వాడకం యువతలో రోజురోజుకూ పెరిగిపోతోంది. గడిచిన కొద్ది రోజుల నుంచి స్థానిక యువత మాదక ద్రవ్యాలను ఉపయోగిస్తూ అంతులేని మత్తులోకి వెళుతున్నారు.

ఈ ఘటనలు అడపాదడపా స్థానికుల కంటపడుతూనే ఉన్నాయి. గతంలో భారీ స్థాయిలో పీవీకాలనీ ప్రాంతంలో ఒక వ్యక్తి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకోవడం, పోలీసుల వాహన తనిఖీల్లో కూడా గంజాయి దొరికడం గంజాయి వాడకానికి నిదర్శనం.

ఎక్కడెక్కడ..

పీవీకాలనీలోని సింగరేణి పాఠశాల వద్ద ఉన్న అటవీ ప్రాంతంలో కొంతమంది యువకులు నిత్యం గంజాయిని సేవిస్తూ మత్తులో ఊగిసలాడుతున్నట్లు తెలుస్తోంది. పైలట్ కాలనీలోని ఎక్స్‌లెంట్ స్కూల్ సమీపంలో ఉన్న కాలువ దగ్గర కూడా కొందరు గంజాయి తాగుతూ.. అటువైపుగా వెళ్తున్న వారిని అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వీరికి గంజాయి ఎక్కడి నుంచి వచ్చిందన్నది ప్రశ్నార్థకం. విశ్వసనీయ సమాచారం మేరకు.. పీవీకాలనీతోపాటు బాపనకుంట, చేపల మార్కెట్ ప్రాంతాల్లో కొంతమంది తమ ఇళ్లను, తోడుపుబండ్లును అడ్డాలుగా చేసుకుని గంజాయిని విక్రయిస్తున్నారు. చేపలమార్కెట్ ప్రాంతంలో అయితే ఎక్సైజ్ శాఖా కార్యాలయానికి కూతవేటు దూరంలోనే గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని వినికిడి.

ఎక్కడ నుంచి రవాణా అవుతోంది?

స్థానికంగా ఎక్కడెక్కడ యువతకు గంజాయి అముతున్నారన్నదానికంటే అమ్మేవారికి ఎక్కడ నుంచి రవాణా అయిందన్నది శోధించాల్సిన విషయం. చర్ల, అశ్వాపురం, ఏటూరునాగారం తదితర ప్రాంతాల నుంచి కొంతమంది గంజాయి కొనుగోలు చేసి మణుగూరు తీసుకువచ్చి అమ్ముతున్నారన్న అంశం గతంలోనే తేటతెల్లమైంది. అయినా ఎక్సైజ్, పోలీస్ అధికారులు ఆ దిశగా గంజాయి రవాణా, యువతలో వాడకాన్ని పూర్తి స్థాయిలో నియంత్రించడంలో వైఫల్యం చెందారని మణుగూరు మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఆరోగ్యం క్షీణిస్తుంది



గంజాయి వాడకం వల్ల ఊపిరితిత్తులు ఉబ్బి గాలి పీల్చుకోవడం కూడా ఇబ్బందిగా ఉంటుంది. మెదడులో ఉన్న నరాలు బలహీనతకు గురవుతాయి. స్పెషల్ యు పోరియా వల్ల గంజాయి తీసుకునే వారు మైకం స్థితిలో ఉంటారు. వీలైనంత త్వరగా గంజాయి మత్తు నుంచి బయటకు రావడం మంచిది.

– డాక్టర్ కోట సునీల్, ఆర్ఎంఓ

గంజాయి మత్తుతో ప్రమాదాలు



గంజాయి సేవించడం వల్ల జీవితాలు నాశనమవుతాయి. కుటుంబాల్లో కలహాలు వస్తాయి. గంజాయికి అలవాటు పడ్డవారు మంచి డాక్టర్‌ను కలిసి కౌన్సెలింగ్ తీసుకుని గంజాయి మత్తుకు దూరంగా ఉండాలి. గంజాయి రవాణా, వాడకాన్ని నియంత్రించేందుకు మా వంతుగా చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీనివాస్, ఎస్సై

ఇస్తామన్న ఇళ్లు ఎక్కడ?


ఆందోళన చేస్తున్న మహిళలు

భద్రాచలంటౌన్: గోదావరి వరదల సమయంలో ఆ కాలనీ వాసులు ఇళ్లు మునిగి పునరావస కేంద్రాల్లో తలదాచుకున్నారు. ఆ సమయంలో అప్పటి కలెక్టర్ వారి వద్దకు వచ్చి.. పునరావాస కేంద్రం నుంచి నేరుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు పంపిస్తామన్నారు. ఇది జరిగి సంవత్సరాలు కావొస్తున్నా ఆ ఇళ్లు అప్పగించింది లేదు. భద్రాచలం పట్టణంలోని ఆదర్శనగర్, కొత్తకాలనీ వాసుల గోస ఇది. ఏఎంసీ కాలనీలో కట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను తమకు కేటాయించాల్సిందేనంటూ సోమవారం వారు ఆందోళన చేపట్టారు. డబుల్ ఇళ్ల ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. సంఘటనా స్థలానికి సీఐ నాగరాజు రెడ్డి చేరుకుని.. బాధితులతో మాట్లాడారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉందని, ఎన్నికల అనంతరం సమస్య అధికారుల దృష్టికి తీసుకెళ్లే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

తాగునీటి ఎద్దడి

ములకలపల్లి: తాళ్లపాయ వాసులు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. వారం రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోవడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో స్థానికులు పంటచేల మోటార్ల నుంచి నీటిని తెచ్చుకుంటూ అవసరాలు తీర్చుకుంటున్నారు. సమస్యను సత్వరమే పరిష్కరించాలని కోరుతున్నారు.

ఉత్తమ కరస్పాండెంట్‌గా అవార్డ్

బూర్గంపాడు: సారపాకలోని బ్రిలియంట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ బి.నాగేశ్వరరావుకు ఎస్ఆర్ఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందించారు. ఆదివారం రాత్రి ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ కమిషనర్ జీవన్‌లాల్, నిట్ ప్రొఫెసర్ ఎన్వీ ఉమా మహేష్‌ల చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. ఎందరో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దినందుకు గాను అవార్డును అందించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఎఫ్ ఫౌండేషన్ అధ్యక్షులు తుమ్మ అమరేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్యవతి మృతి తీరని లోటు

చర్లరూరల్: బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి మరణం భారతీయ జనతా పార్టీకి తీరని లోటని బీజేపీ నియోజకవర్గ కోకన్వీనర్ బిట్రగుంట క్రాంతి కుమార్ అన్నారు. రెండు రోజుల క్రితమే చర్ల ఏజెన్సీ గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో చురుకుగా పాల్గొన్న ఆమె.. అకాల మృతి కలచి వేసిందన్నారు. సోమవారం ఆమె మృతదేహాన్ని బీజేపీ నాయకులు సంతపురి సురేష్, నక్కా కన్నారావు, శేషగిరిరావు, గోపి, ఉదయ్, రత్తయ్య, లోకనాథంలు సందర్శించారు.

గ్రాడ్యుయేట్ హోటల్


హోటల్ ప్రారంభిస్తున్న కామరాజు

దుమ్ముగూడెం: స్థానిక ఓ ఆదివాసీ యువతి డిగ్రీ చదివినా తగిన ఉద్యోగం లేకపోవడం, ప్రభుత్వ ఉద్యోగాల విషయంలోనూ ప్రభుత్వం నోటిఫికేషన్లు వేయకపోవడంతో తన గ్రామంలోనే ఓ హోటల్‌ను ఏర్పాటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అచ్యుతాపురం గ్రామానికి చెందిన గిరిజన యువతి కుర్సం ఆమని డిగ్రీ విద్యను చదివింది. డిగ్రీ పూర్తయి 4 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ వేయకపోవడం, ప్రైవేటుగాను చదువుకు తగిన ఉద్యోగాలు అందుబాటులో లేకపోవడంతో శ్రీ గంగాదేవి పేరిట టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసుకుంది. ఈ హోటల్‌ను సోమవారం ఏఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నేటి వరకూ ఉద్యోగ నోటిఫికేషన్ లేక పోవడంతో నిరుద్యోగ వ్యవస్థ అంతు చిక్కనంత రీతిలో పెరిగిపోయిందంటూ ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కురసం రవి, ఆట నాయకులు సోయం కోటేశ్వరరావు, గుడ్ల శ్రీను, కురసం వెంకటేష్, తెల్లం వెంకటేష్, కురసం మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

'బోయినపల్లి'కి ఘన నివాళి

అన్నపురెడ్డిపల్లి: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బాలాజీ ఆలయ మాజీ చైర్మన్ బోయినపల్లి పెద్దసుబ్బారావుకు ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం మండలంలోని ఎర్రగుంట గ్రామంలో నిర్వహించిన ఆయన దశదినకర్మ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు సతీమణి మాధవి, కుమారుడు డాక్టర్ ప్రతిభ్, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, చంద్రుగొండ జెడ్పీటీసీ వెంకటరెడ్డి, అన్నపురెడ్డిపల్లి శివాలయ పునఃనిర్మాణకర్త మారగాని శ్రీనివాసరావు పాల్గొన్నారు. బోయినపల్లి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.


వెంకట సుబ్బారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ నామా నాగేశ్వరరావు, తదితరులు

ఉచిత వైద్య శిబిరాలు


దుమ్ముగూడెం: పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఉషారాణి

చర్లరూరల్: చర్ల మండలంలోని లింగాపురం, లింగాపురం పాడు గ్రామాల్లో సోమవారం చర్ల ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. రెండు గ్రామాల్లో రోగులను పరిశీలించి వారికి కావలసిన మందులను పంపిణీ చేశారు. డీపీఎంఓ ముత్యాలరావు, హెల్త్ సూపర్ వైజర్ రాంప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీలు రమ్య, స్వరూప, ఎఎన్‌యంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

దుమ్ముగూడెం: మండలంలోని చెరుపల్లి పరిధిలో ఉన్న పూజారిగుంపు, కోనబోయిన వారి గుంపులో ఆర్లగూడెం ఆయుర్వేద వైద్యులు ఉషారాణి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. 80 మందిని పరీక్షించి వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది ఈశ్వరి, ఆశావర్కర్ సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో..

అశ్వాపురం: మండల పరిధిలోని జగ్గారం–1 అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం మండల ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ జి.అరుణ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శిబిరానికి వచ్చిన రోగులకు వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను జీవనశైలి, ఆయుర్వేద ఔషధాల విశిష్టత, వాతావరణ మార్పుల ద్వారా శారీరకంగా వచ్చే వ్యాధులు, గృహ వైద్య చిట్కాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ పారామెడికల్ సిబ్బంది రాధిక, అంగన్‌వాడీ టీచర్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బెర్త్ రాకుండానే బండి రెడీ!


సిద్ధమైన ఆదినారాయణ ప్రచార రథం ఇదే..

అశ్వారావుపేటరూరల్: ఆలూ లేదు, చూలూ లేదు కొడుకు పేరు సోమలింగడు అన్నట్లు అశ్వారావుపేట నియోజకవర్గంలోని ఓ కాంగ్రెస్ నాయకుడు తనకు ఎన్నికలో పోటీకి బెర్తు నిర్ధారణ కాకముందే ప్రచార వాహనాన్ని రెడీ చేసుకున్నాడు. పోటీలో పలువురు నేతలు ఉన్నప్పటికీ సీటు తనదే అన్నట్లు ఫిక్స్ అయిపోయాడు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అశ్వారావుపేట నుంచి సీటు ఆశించే అభ్యర్థుల్లో తీవ్ర పోటీ నెలకొనగా, తొలి విడత జాబితా అభ్యర్థి ఖరారు కాలేదు. దీంతో పార్టీ క్యాడర్‌లో నిరాశ నెలకొంది. కాగా రెండో విడత జాబితాలో తప్పనిసరిగా అశ్వారావుపేట నుంచి అభ్యర్థిని ప్రకటిస్తారనే ప్రచారం జోరుగా సాగుతుంది. దాంతో పార్టీ నుంచి టికెట్ రేసులో ఉన్న స్థానిక మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు, ములకలపల్లి జెడ్పీటీసీ, టీపీసీసీ సభ్యురాలు సున్నం నాగమణి, నియోజకవర్గ నాయకులు జారే ఆదినారాయణ తమ వర్గీయులతో కలిసి రోజంతా ఆరు గ్యారెంటీల ప్రచారం, పరామర్శలు, బతుకమ్మ ఉత్సవాల పేరుతో నిత్యం గ్రామాలను చుట్టి వస్తున్నారు. అయా కార్యక్రమాల్లో వారంతా తమకే టికెట్ ఖరారు అవుతుందని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తరఫున టికెట్ ఆశిస్తున్న జారే ఆదినారాయణ మాత్రం ఒక అడుగు ముందుకు వేసి, ఏకంగా ఎన్నికల ప్రచార రథాన్ని సిద్ధం చేసుకున్నారు. ఈ ప్రచార వాహనం సోమవారం రోడ్డెక్కగా, ఆయన వర్గీయులు సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేస్తున్నారు. తమ నేత ప్రచార వాహనం కూడా సిద్ధమైంది, ఇక టికెట్ ప్రకటించడమే తరువాయి అంటూ చెబుతున్నారు. ఆదివారం రాత్రి దమ్మపేట మండలం అర్బన్ కాలనీలో కార్యకర్తలు బాణసంచా కూడా కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు. దీంతో ఈ ఘటనలు పార్టీలోని ఇతర వర్గాల్లో చర్చనీయాంశాలు అయ్యాయి.

మౌలిక వసతులు కల్పించండి


చంద్రుగొండ: మంగయ్యబంజర్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నోడల్ అధికారి రామం

చంద్రుగొండ: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయలు కల్పించాలని ఎన్నికల నోడల్ అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామం సూపర్‌వైజర్లకు సూచించారు. సోమవారం ఆయన మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఓటర్లకు అసౌకర్యం లేకుండా సదుపాయాలు ఉండాలన్నారు. విద్యుత్, ర్యాంపులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు సక్రమంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సాదియాసుల్తాన, ఎస్సై మాచినేని రవి, సూపర్‌వైజర్లు అక్బర్, సంతోష్, శ్రీనివాసరావు ఉన్నారు.

ములకలపల్లి: పోలింగ్ స్టేషన్లలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించాలని నియోజకవర్గ నోడల్ ఆఫీసర్ ఎస్.రామం అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని పోలింగ్‌స్టేషన్లను సోమవారం సందర్శించిన ఆయన, రెండు రోజుల్లో పనులన్నీ పూర్తి చేయాలని అన్నారు. ప్రత్యేక అవసరాలుగల ఓటర్లకు ఇబ్బంది కలుగకుండా ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో ర్యాంప్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎస్ఓలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణపట్ల అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీఓ శ్రీను, ఎంపీఓ లక్ష్మయ్య, ఏఎస్సై తిరుమలరావు, పీఆర్ఏఈ సురేశ్, కార్యదర్శి శ్రీను తదితరులు ఉన్నారు.

గడపగడపకు ప్రచారం చేయాలి


దమ్మపేట: సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ మెంబర్ సున్నం నాగమణి

అశ్వారావుపేటరూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసే గ్యారెంటీ కార్డుల పథకాలపై గడపగడపకూ తీసుకెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆ పార్టీ టీపీసీసీ, ములకలపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి కార్యకర్తలకు సూచించారు. మండలంలోని గుర్రాల చెరువు గ్రామంలో సోమవారం రాత్రి బూత్ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ గ్యారెంటీ కార్డులు ఇచ్చి, అందినట్లు రసీదులు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మా రాంబాబు, కొప్పుల శ్రీను, సత్యం రామకృష్ణ, ఉప్పల రాజశేఖర్, చంద్రరావు, బాలాజీ, జల్లి అర్జున్, కలపాల శ్రీను పాల్గొన్నారు.

దమ్మపేట: తెలంగాణలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తప్పకుండా అధికారంలోకి వస్తుందని, టీపీసీసీ మెంబర్, ములకలపల్లి జెడ్పీటీసీ సున్నం నాగమణి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టో, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోకు పూర్తి నకలుగా ఉందని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, మిషన్ భగీరథ, పోడు భూములకు పట్టాలు తదితర పథకాలు అన్ని అసంపూర్తిగా మిగిలిపోయాయని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మద్దిశెట్టి సత్యప్రసాద్, తుమ్మ రాంబాబు, చిన్నశెట్టి చిట్టిబాబు, నాగబాబు, షూకూర్ తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా కిట్లు అందజేత

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బోదకాలు(ఫైలేరియా) వ్యాధిగ్రస్తులకు సోమవారం ఆరు రకాల వస్తువులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందించిన ఈ కిట్లను బాధితులు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం తోగ్గూడెం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి వివిధ సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేశారు. మందులను పంపిణీ చేశారు. అలాగే షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులకు సైతం మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

కామాక్షి అవతారంలో కనకదుర్గమ్మ

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో ఉన్న కనకదుర్గమ్మ వారి దేవాలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం అమ్మవారిని కామాక్షి అవతారంలో అలంకరించారు. ఆలయ అర్చకులు ఆరుట్ల రాజగోపాల్‌చార్యులు తెల్లవారుజామున కనకదుర్గమ్మకు విశేష పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం కామాక్షి అవతారంలో అలంకరించి కుంకుమ పూజార్చన చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

గాయత్రి దేవీ అలంకరణలో..

అశ్వారావుపేటరూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని కొత్త మామిళ్లవారిగూడెం, వినాయకపురం, గుమ్మడవల్లి, ఆసుపాక, ఊట్లపల్లి, తిరుమలకుంట, నారంవారిగూడెం కాలనీ (శ్రీరంగాపురం), అచ్యుతాపురం, అశ్వారావుపేటతోపాటు పలు గ్రామాల్లో కొలువుదీరిన అమ్మవారు గాయత్రి దేవీ అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి వివిధ రకాల పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు.

మణుగూరురూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గుట్టమల్లారం గ్రామంలోని పంచముఖ వేదగాయత్రీదేవి ఆలయంలో అమ్మవారు యధారూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. గాయత్రీదేవి అమ్మవారికి ఆలయ అర్చకుల మంత్రోచ్చరణ నడుమ తామర పూలతో పుష్పార్చన, పసుపు, కుంకుమలతో అర్చన, ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించి తరించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దయానిధి అక్కినేపల్లి వసంతాచార్యులు, అర్చకులు ప్రదీప్‌శాస్త్రీ, భక్తులు ముద్రగడ శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు, నాదెండ్ల ముత్యాలరావు, నెట్టెం రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


అన్నపురెడ్డిపల్లి: బాలాజీ ఆలయంలో సంతాన లక్ష్మిగా దర్శనమిస్తున్న అమ్మవారు


దుమ్ముగూడెం: అమ్మవారిని దర్శించుకుంటున్న మహిళలు

సంతానలక్ష్మి అలంకరణలో..

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు సోమవారం సంతాన లక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శివాలయంలోని కొలువుదీరిన అమ్మవారిని మధుర మీనాక్షి అమ్మవారిగా అలంకరించారు. మండలంలో వివిధ రుపాలలోని కొలువుదీరిన అమ్మవార్లను భక్తులు దర్శించుకొని, తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.


మణుగూరురూరల్: అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు